విశాలాంధ్ర గోదావరి జిల్లా ఏలూరు, పశ్చిమ గోదావరి

రైలు ప్రమాద మృతులకు నివాళి

విశాలాంధ్ర-భీమడోలు: భీమడోలు శాఖా గ్రంథాలయంలో ఆదివారం గ్రంథపాలకుడు కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు ఉత్సాహంగా జరిగాయి. తొలుత ఒడిశాలో ఘోర రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని గ్రంథాలయంలోని విద్యార్థులు, పాఠకులు, సిబ్బంది నివాళులు అర్పించారు. మృతి చెందిన వారి బాధిత కుటుం బాలను ప్రభుత్వం ఆదు కోవాలని, ఈ ప్రమాదం పెను విషాదాన్ని నిప్పిందాన్నారు. మానవత వాదులు వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. అనంతరం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తుమ్మల ఉమామహేశ్వర రావు చిన్నారులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు.

నేడు జిల్లా కలెక్టరేట్ లో స్పందన

విశాలాంధ్ర-ఏలూరు: ఏలూరు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని గోదావరి సమావేశ మందిరంలో ఈనెల 5న సోమవారం ఉదయం గం.10 నుంచి 'స్పందన' కార్యక్రమం యధావిధిగా నిర్వహించబడుతుందని జిల్లా కలెక్టర్ వె. ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని డివిజనల్, మండల, మున్సిపల్ కార్యాలయాలల్లోను 'స్పందన' కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి యధావిధిగా నిర్వహించబడుతుందన్నారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కు తప్పనిసరిగా ధరించి సామాజిక దూరం పాటించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గుండెపోటుతో మహిళ మృతి

విశాలాంధ్ర-భీమవరంటౌన్: హఠాత్తుగా ఓ మహిళ గుండె పోటుతో మృతి చెందిన ఘటన భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ ఎదురుగా చోటుచేసుకుంది. నరసాపురం మండలం లక్ష్మనేశ్వరం గ్రామానికి చెందిన కొప్పడ మంగ కొంతకాలంగా అనారోగ్యంగా ఉండటంతో విజయవాడలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స చేయించి, గత వారంలో ఇంటికి తీసుకుని వచ్చారు. అదే క్రమంలో మరో మారు హాస్పిటల్ చెకప్ చేయించేందుకు భర్త పరశురాం విజయవాడ తీసుకెళ్లడానికి భీమవరం టౌన్ రైల్వే స్టేషన్లో రైలు ఎక్కేందుకు తీసుకుని రాగా. స్టేషన్ ఎదుట కుప్పకూలి పోవడంతో స్థానికులు 108కి సమాచారం ఇచ్చారు అప్పటికే ప్రాణాలు విడిచినట్టు 108 సిబ్బంది నిర్ధారించారు. మృతురాలికి భర్త ఇద్దరు కుమారులు ఉన్నారు.

చోరీలు, రహదారి ప్రమాదాల నివారణకు గస్తీ

విశాలాంధ్ర-ఏలూరు క్రైమ్: ఏలూరు, జంగారెడ్డి గూడెం, పోలవరం, నూజివీడు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న అన్ని పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బంది రాత్రి పూట అసాంఘిక కార్యకలాపాలు, దొంగతనాలు, రహదారి ప్రమాదాల నివారణ కొరకు గస్తి నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ , రాత్రిపూట వాహనదారులకు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రార్థనాలయాలు వద్ద, బ్యాంకుల వద్ద ఏటీఎంల వద్ద ఏవిధమైన అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా ముందస్తుగా రాత్రి పూట అక్కడ ఏర్పాటు చేసిన వాచ్ మెన్ లకు అధికారులు సూచనలు చేసారు.బస్టాండ్లు, రైల్వే స్టేషన్లో వివిధ లాడ్జిల్లో అనుమానాస్పద వ్యక్తులు, నేరస్థుల గురించి తనిఖీలు నిర్వహించి, వాహనాలలో గంజాయి, నాటు సారాయి, రాష్ట్ర ప్రభుత్వ నిషేధించిన గుట్కా ఖైని పదార్థాలు అక్రమ రవాణా జరగకుండా జాతీయ, రాష్ట్ర హైవే ఇతర మార్గాలలో వాహన తనిఖీలు నిర్వహించినారు.

స్వయం ఉపాధికి ఉచిత కుట్టుమిషన్ కేంద్రాలు దోహదం

విశాలాంధ్ర-టి నరసాపురం: మహిళలు స్వయం ఉపాధికి ఉచిత కుట్టుమిషన్ కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని తపన ఫౌండేషన్ ప్రతినిధి శివ గణేష్ తెలిపారు. మండలంలోని ఏపిగుంట పంచాయతీ శ్రీరామవరం గ్రామంలో తపన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టుమిషన్ శిక్షణా కేంద్రాన్ని కాల్నీడి శ్రీరాములు ఆదివారం ప్రారంభించారు మహిళలు పెద్ద సంఖ్యలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జట్ల రాంబాబు, అడపా వెంకట్రావు శ్యాంసుందర్, లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

విశాలాంధ్ర-టి నరసాపురం: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు అని గ్రంథపాలకుడు ఆర్ కిషోర్ తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలు కార్యక్రమంలో భాగంగా ఆదివారం విద్యార్థులకు పద్యాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవరచుకోవాలి అన్నారు. పుస్తక పఠనం వలన విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు.విద్యార్థులు వేసవి విజ్ఞాన శిబిరాలు వినియోగించుకొని సృజనాత్మకతను పెంపొందించుకోవాలని తెలిపారు.

క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలి

విశాలాంధ్ర-లింగపాలెం: పద్యాల్లో ఉన్న నీతిని గమనించి వాటికి అనుగుణంగా విద్యా ర్థులు నడుచుకోవాలని, దీని వల్ల భవిష్యత్తులో ఎంతగానో ఉపయోగం ఉంటుందని పలు వురు ఉపాధ్యాయులు తెలి పారు. ధర్మాజీగూడెం గ్రంథాల యంలో వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా నీతి పద్యాలు, తెలుగు గ్రామర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ, నిజాయితీని అలవాటు చేసుకోవటం వల్ల ఉన్నతంగా ఎదిగేందుకు దోహదపడుతుందని అన్నారు. ప్రతీ విషయంపై ఏకాగ్రతను అలవర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి వెంకటరమణ, ఉపాధ్యాయులు ఎ.వి.నారాయణ, ఆర్.సరళ కుమారి, సిస్టర్ మేరీ, పి.జోజి, మేరీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-మండవల్లి: బాల్యం నుండే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని చిన్నారులకు సూచించారు ఐక్యవేదిక నేతలు ఎల్ఎస్ భాస్కర రావు, గ్రంధపాలకురాలు షేక్‌పర్వీన్. మండవల్లి లైబ్రరీలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా చిన్నారులకు పర్యావరణం, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. జూన్5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటామని జీవరాశుల మనుగడకు ఆటంకాలు లేకుండా సాగాలంటే ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని భాస్కరరావు కోరారు. ప్రకృతి వనరులు సంరక్షించుకోవాలని మొక్కలను విరివిగా నాటి వాటిని సంరక్షించాలని హితవు పలికారు. లైబ్రేరియన్ పర్వీన్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించాలని కాగితపు సంచులు, నారసంచులు వినియోగించాలని పేర్కొన్నారు. కాలుష్య నివారణలో భాగంగా పచ్చదనాన్ని పెంచాలని సూచించారు. చిన్నారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బేబీ కిట్స్‌కు బై...బై?

ప్రభుత్వాసుపత్రుల్లో రెండేళ్లుగా పంపిణీ బంద్

పెదవి విరుస్తున్న పేద బాలింతలు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: ప్రజా సంక్షేమమే పరమావధి. పేదరికం ఏ రూపంలో ఉన్నా తమ ప్రభుత్వం అండగా ఉంటుందని సభలు, సమీక్షలలో ముఖ్యమంత్రి జగన్, అమాత్యులు ఉపన్యాసాలు ఇస్తుంటారు. వారి మాటలకు, కార్యాచరణ అమలుకు పొంతన ఉండటం లేదు. ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలకు ఎక్కువ మంది పేదలే వస్తుంటారు. అక్కడ చికిత్స సంగతి దేవుడెరుగు. చివరకు ప్రసవ సమయంలో అందే పథకాలకు కూడా ప్రభుత్వం మంగళం పాడింది. ఈ కోవలోనే శిశువు ఆరోగ్య సంరక్షణ కోసం ఇచ్చే బేబీ కిట్ల పంపిణీకి రెండేళ్లుగా మంగళం పాడారు. ప్రసవానంతరం ఇంటికి వెళ్లే సమయంలో శిశువు ఆరోగ్య సంరక్షణ కోసం టీడీపీ ప్రభుత్వం 2016 జూలైలో నవజాత శిశువుల సంరక్షణ కోసం ఎన్టీఆర్ బేబీ కిట్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. కిట్లలో ఉండే ఖరీదైన సామాగ్రి పెట్టి ఉచితంగా పంపిణీ చేసింది. ఎందరో నిరుపేద తల్లులు లబ్ధి పొందారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తొలినాళ్లలో డాక్టర్ వైఎసఆర్ బేబీకిట్‌గా ఈ పథకానికి పేరు మార్చి కొన్నాళ్లు అందజేశారు. కొంతకాలం సజావుగా సరఫరా చేసిన కిట్లను కరోనా సాకుతో గత రెండేళ్లుగా ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా నిలిపివేసింది. వాస్తవానికి వీటిని సరఫరా చేసే సంస్థలకు ప్రభుత్వం కోట్ల రూపాయలు బకాయి పడటంతో తయారీ నిలిపివేసిందని తెలుస్తోంది. నిధుల కొరత ఏర్పడటంతో ప్రస్తుతం ఈ పథకం కొనసాగుతుందో లేదో అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. బిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం పేదలు అప్పు చేసి బహిరంగ మార్కెట్లో బేబీ కిట్లు కొనుగోలు చేయలేని స్థితిలో నిట్టూరుస్తున్నారు. ఆర్థిక భారం మోయలేక, ప్రభుత్వ తీరుపై పెదవి విరుస్తున్నారు.

బేబీ కిట్స్‌లో ఏముంటాయంటే..

బిడ్డ ఆరోగ్య సంరక్షణ కోసం ప్రభుత్వం అందించే బేబీ కిట్‌లో దుప్పటి, దోమతెర, స్లీపింగ్ బెడ్, పౌడర్, లోషన్, నేప్ కిన్, డైపర్స్, సబ్బులు ఉండేవి. ఇవన్నీ శిశువు అనారోగ్య బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయి. ప్రస్తుతం ఈ కిట్ బయట కొనాలంటే రూ.1500 నుండి రూ.2వేలు చెల్లించాల్సి వస్తోందని పేదలు వాపోతున్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 64, కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం 1, అర్బన్ హెల్త్ సెంటర్లు ఏలూరు నగర కార్పొరేషన్ లో 10, జంగారెడ్డిగూడెం, నూజివీడులలో 2 చొప్పున మొత్తం 14 ఉన్నాయి.జిల్లా మొత్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో 2022 ఏప్రిల్ నుండి 2023 మార్చి వరకు మొత్తం 9685 ప్రసవాలు జరిగాయి. వీరందరికీ నేటికీ బేబీ కిట్లు అందలేదు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవానంతరం బాలింతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణం బేబీ కిట్లు పంపిణీ చేయాలని కోరుతున్నారు.

కుక్కల దాడుల నుంచి కాపాడాలి

విశాలాంధ్ర-లింగపాలెం: పుప్పాలవారిగూడెంలో జరిగిన రాత్రి బస కార్యక్రమంలో తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ ప్రజలతో ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను తహశీల్దార్‌కు వివరించారు. గ్రామంలో వీధి కుక్కలు దాడులు చేస్తున్నాయని, వీటి దాడికి గాయపడి ఆసుపత్రి పాలవుతున్నామని తెలిపారు. కుక్కల దాడుల నుంచి కాపాడాలంటూ ప్రజలు మొరపెట్టారు. గ్రామంలో పూర్తి స్థాయిలో డ్రెయిన్లు నిర్మించాలని కోరారు. భూముల క్రయ, విక్రయాల్లో సమస్యలు ఉన్నాయని, వీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. గ్రామంలో ఉన్న పలు సమస్యలను తహశీల్దార్ ముందు ఉంచారు. గ్రామస్తులు తెలిపిన సమస్యలు పరిష్కరించే చర్యలు తీసుకుంటానని తహశీల్దార్ తెలిపారు.

నేడు ఏఐవైఎఫ్ జనరల్ బాడీ సమావేశం

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: నేటి ఉదయం గం.10లకు పట్టణంలో గల రోటరీ క్లబ్ భవనంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏలూరు జిల్లా జనరల్ బాడీ సమావేశం జరుగుతుందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో మండల కార్యదర్శి జేవీ రమణ రాజు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కృష్ణ చైతన్య పాల్గొని మాట్లాడుతూ జనరల్ బాడీ సమావేశానికి ఏఐవైఎఫ్ జాతీయ మాజీ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర ముఖ్య అతిథులుగా హాజరవుతారని తెలిపారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో జగన్ అధికారం చేపట్టిన నాటినుండి వారు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వలన నిరుద్యోగం పెరిగిందని విమర్శించారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని వాగ్దానం చేసి ఉద్యోగాల కల్పన లేకపోగా ఉన్న ఉద్యోగాలను తీసివేసిన ఘనుడు మోడీ అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉద్యోగాలు ఇస్తానని,ప్రతీ సంవత్సరం జనవరిలో జాబ్ క్యాలెండర్ ఇస్తానని చెప్పిన జగన్ 4 సంవత్సరాలు అయినా కూడా ఉద్యోగాల కల్పన ఊసే లేకుండా నిరుద్యోగులను మోసం చేశారన్నారు. జిల్లాలోని యువతీ యువకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి కుంచె వసంత రావు,యువజన సంఘం నాయకులు తాళ్లూరి నాగరాజు,వడ్లమానాటి శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

విశాలాంధ్ర-లింగపాలెం: ధర్మాజీగూడెంలోని బస్టాండులో ఉన్న ఆక్రమణల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు వీటిని తొలగించే పనులను అధికారులు చేపట్టారు. ఆక్రమణల వల్ల తలెత్తుతున్న సమస్యలను విశాలాంధ్ర వెలుగులోకి తెచ్చింది. దీనిపై రహదారుల శాఖ, రెవెన్యూ, పంచాయితీ అధికారులు స్పందించారు. ఆక్రమణలను గుర్తించి అక్రమ కట్టడాలను తొలగించేందుకు హద్దులు నిర్ణయించారు. బస్టాండు స్థలంతోపాటు గ్రామంలో ప్రధాన రహదారికి రెండు వైపులా ఉన్న ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి హోలిట్రినిటి స్కూలు వరకు దాదాపు మూడు కిలోమీటర్లలో రోడ్డు మార్జిన్లలో ఉన్న ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని తెలిపారు. గ్రామంలో ఆక్రమణల వల్ల దుష్పరిణామాలు తలెత్తుతుండడంతో ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమవుతుంది. వీటిని తొలగించాలని పలువురు అధికారులకు మొరపెడుతూనే ఉన్నారు. ఎట్టకేలకు అధికారులు స్పందించటంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా పూర్తిగా తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా గన్ను, దొంతా

విశాలాంధ్ర-చింతలపూడి: ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా గన్ను వెంకట్రావు, ప్రధాన కార్యదర్శిగా దొంతా కృష్ణతో పాటు మరో 11 మందితో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు దొంతా కృష్ణ తెలిపారు. ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడిగా గన్ను వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా గుంటు ముక్కల సతీష్, ప్రధాన కార్యదర్శిగా దొంత కృష్ణ, సహాయ కార్యదర్శిగా నాగేంద్రరావు, కోశాధికారిగా రావెళ్ల రాజేశ్వరరావు, కమిటీ సభ్యులుగా తక్కెలపాటి ప్రసాద్, జిల్లెల్ల కృష్ణ, కేరళ వెంకటేశ్వరరావు, పుచ్చకాయల రామచంద్రారెడ్డి, కుప్పాల నాగేశ్వరరావు, గౌరు శ్రీనివాసరావులను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ పట్టణ కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో నూతన కమిటీ, తీర్మానాల వివరాలను పత్రికలకు విడుదల చేశారు. శనివారం జరిగిన కౌలు రైతు సంఘం జిల్లా ప్రథమ మహాసభలో ఈ క్రింది తీర్మానాలను ఆమోదించినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి దొంతా కృష్ణ తెలిపారు. వరి పంటకు క్వింటాకు రూ.3500, పామాయిల్ పంటకు టన్నుకు రూ. 20వేల గిట్టుబాటు ధర కల్పించాలని ఢిల్లీలో ఆందోళన చేస్తున్న మహిళజర్లకు మద్దతు తెలియజేస్తూ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ పార్లమెంటు సభ్యత్వం రద్దు చేసి, అతనిని అరెస్ట్ చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం వెంటనే పున: ప్రారంభించి నిర్వాసితులకు ఎకరాకు రూ.40 నష్టపరిహారం చెల్లించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితులకు రూ.40 లక్షల నష్టపరిహారం ఇచ్చి సర్వీస్ రోడ్లు వేయాలని, 2019 కౌలు రైతు చట్టంలో ఉన్నటువంటి భూ యజమాని అనుమతి అనే నిబంధనం తొలగించాలని గ్రామసభల ద్వారా కౌలు రైతులను గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కౌలు రైతులకు రూ.1000 కోట్లతో రక్షణ నిధి ఏర్పాటు చేయాలని తీర్మానించారు. రూ.2 లక్షల వరకు రైతులకు పంట రుణాలు రద్దు చేయాలని, మల్లాయగూడెం శివారు 6 గ్రామాల వ్యవసాయ భూములకు చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నీరు అందించి సస్యశ్యామలం చేయాలని, కౌలు రైతులకు వ్యవసాయ పెట్టుబడి ప్రభుత్వం పెట్టి దాన్యం కొనుగోలులో రికవరీ చేసుకోవాలని తీర్మానించారు.దీని వల్ల దళారీ దోపిడీ వ్యవస్థ తగ్గుతుందని, వెంకటాద్రి గూడెం నుండి ఎర్ర చెరువు వరకు లింకు చెరువులు 19 ఉన్నాయని వాటికి చింతలపూడి ఎత్తిపోతల పథకం ద్వారా నీరందించాలన్నారు.

రెవెన్యూ కార్యాలయంలో బదిలీలు

విశాలాంధ్ర-లింగపాలెం: లింగపాలెం తహశీల్దార్ కార్యాలయంలో భారీగా బదిలీలు జరిగాయి. కార్యాలయానికి నూతన ఉప తహశీల్దార్‌గా ఏలూరు డిఎస్‌ఓ కార్యా లయంలో పనిచేస్తున్న కె.సునీతను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉప తహ శీల్దార్‌ను ఏలూరు డిఎస్‌ఓ కార్యాలయానికి బదిలీ చేశారు. అయిదేళ్ళ నుంచి ఖాళీగా ఉన్న జూనియర్ అసిస్టెంట్ పోస్టును ఎట్టకేలకు భర్తీ చేశారు. ఈ పోస్టులో వలీని నియమించారు. పలువురు రెవెన్యూ అధికారుల బదిలీలు జరిగాయి. వేములపల్లి విఆర్వోగా అనితను, అయ్యపరాజుగూడెం విఆర్వోగా సాంబమూర్తిని, కె.గోకవరం-1 విఆర్వోగా టి.రాజాను నియమించారు. కొత్తపల్లి విఆర్వోగా పనిచేస్తున్న శర్మను నరసన్నపాలెంకు, నరసన్నపాలెం విఆర్వోగా పనిచేస్తున్న విఆర్వోను కొత్తపల్లికి బదిలీ చేశారు. బదిలీల వివరాలను తహశీల్దార్ ఆర్.వి.మురళీకృష్ణ వెల్లడించారు.

ఉచిత వైద్యసేవా కేంద్రాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-భీమవరం: సాధారణ వ్యాధులు, మహిళల ఆరోగ్య సమస్యలకు సంబంధించి ప్రతి రోజు సాయంత్రం మేంటేవారి తోటలోని అల్లూరి సీతా రామరాజు భగత్ సింగ్ వైద్య సహాయ కేంద్రలో వైద్య సేవలను అందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు కోరారు. అలాగే ప్రతి మంగళవారం ఉదయం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి గుండె వైద్య నిపుణులు సేవలు అందిస్తారన్నారు. అవసరమైన వారికి ఇసిజి, ఎకో వంటి పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు .ఉచిత పరీక్షలు, చికిత్స కొరకు వైద్య సహాయంను అవసరమైన వారందరూ వినియోగించుకోవలసిందిగా ఆయన కోరారు.

ప్లాస్టిక్‌తో సమస్త జీవరాశికి పెను ప్రమాదం



విశాలాంధ్ర-భీమవరం: ప్లాస్టిక్ భూతంతో సమస్త జీవరాశికి ప్రమాదం పొంచి ఉందని అందరూ అప్రమత్తంగా ఉండాలని పర్యావరణవేత్త డాక్టర్ మట్లపూడి సత్యనారాయణ హెచ్చరించారు. శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ముందస్తు కార్యక్రమంలో భాగంగా పర్యావరణంపై చిన్నారులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ మనిషి సగటున 5 గ్రాముల విషపూరిత ప్లాస్టిక్ ను ఆహారంతో తీసుకుంటున్నట్లు గణాంకాలు వెల్లడించారు. ప్రతీ రోజు 25 వేల మెట్రిక్ టన్నుల వ్యర్థాలు పర్యావరణంలోకి చేరుతున్నాయని ప్లాస్టిక్ వాడకం ఆపివేయాలని ఆయన విద్యార్థులకు వివరించారు. అనంతరం పుస్తక పఠనం, పుస్తక సమీక్షపై విద్యార్థులకు తరగతులు నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి ఆధ్వర్యంలో బాలలకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై డ్రాయింగ్, వ్యాసరచన చిత్ర లేఖన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి ఎస్.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఆయా కార్యక్రమాల్లో అప్ కాస్ట్ పశ్చిమ గోదావరి జిల్లా సమన్వయకర్త మల్లుల శ్రీనివాస్, చదువరుల సంఘం అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సంఘసేవకులు చెరుకువాడ రంగసాయి, అధ్యాపకులు ఎం.రాజేంద్ర బాబు, రేపాక వెంకన్న బాబు, కలిగొట్ల గోపాల శర్మ, డి.రామ నాగేశ్వరరావు, సి.హెచ్.లక్ష్మి, పద్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సినీ సంగీత జగత్తులో ధృవతార బాలు

విశాలాంధ్ర-భీమవరం టౌన్: మధుర గాయకులు, సినీ జగత్తులో ధృవతార ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం జయంతిని అంకాల అకడమీ ఆర్ట్స్ భవనంలో ఆదివారం స్వచ్ఛంద సంస్థలో నిర్వహించారు. అకాడమీ కోశాధికారి గోపా సత్యనారాయణ బాలు చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడుతూ యుగంతం వరకు చెరగని ముద్రలు ఎస్పీ బాలు పాటలని అన్నారు. శోభనబాబు కల్చరల్ అసోసియేషన్ స్టేట్ నాయకులు భట్టిప్రోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ భీమవరం చైతన్య భారతీ నాటిక పరిషత్ బాలును పిలిచి సత్కరించారని, అందరినీ ఆప్యాయతగా పలుకరించే బాలు ఆకస్మికంగా మరణించడం అందరినీ కలిచి వేసిందని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ తన గళంతో ప్రపంచంలో భారత దేశ ఖ్యాతిని ఇనుమడింప చేసిన బాలు చివరి కోరిక తిక్కన సోమయాజి విగ్రహం నెల్లూరులో ప్రతిష్టించాలనే విషయాన్ని ప్రభుత్వం నెరవేర్చినప్పుడే నిజమైన నివాళులని అన్నారు. కార్యక్రమంలో ఉండపల్లి రమేష్ నాయుడు, కే శిరీష, పరిమి రామకృష్ణ, గ్రంధి మూర్తి, ఎండి సరోజినీ, కొంద్రు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన వేతన ఒప్పందం కమిటీకి సహకరిస్తాం

విశాలాంధ్ర-భీమవరం: ఆర్టీసీ కార్మికులు ఉద్యోగులకు నూతన వేతన ఒప్పందం కోసం యాజమాన్యం కమిటీ ఏర్పాటు చేస్తే ఎంప్లాయిస్ యూనియన్ పూర్తిగా సహకరిస్తుందని ఆ కమిటీ ఇచ్చిన రిపోర్ట్ పై యాజమాన్యంతో యూనియన్లుగా మాట్లాడుతామని ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.నర్సయ్య అన్నారు. ఆదివారం ఎంప్లాయిస్ యూనియన్ భీమవరం డిపో సెక్రటరీ చిన్నమిల్లి శ్రీనివాసులు నూతన గృహప్రవేశం సందర్భంగా ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మీడియాతో మాట్లాడారు. ఇటీవల ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర మహాసభలు విజయవాడలో జరిగాయని ఈ మహాసభలో రాష్ట్రంలో కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించడం జరిగిందని వీటిని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. ఇయు రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎం.డి. ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వి.రావు, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండి ఆలి, జోనల్ కార్యదర్శి వై.ఎస్.రావు, జోనల్ సభ్యులు బి.అరుణ, ఎస్.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు. కాగ నూతన గృహప్రవేశానికి ప్రత్యేక అతిథిగా డిపో మేనేజర్ ఎస్.గిరిధర్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ సురేష్ ఇయు డిపో అధ్యక్షులు ఆర్.వి.రాజు, కార్యదర్శి సిహెచ్. శ్రీనివాసులు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.సీతారాం ప్రసాద్, జి.ఎస్.ఎస్. రాంబాబు, డి.ఎం.కృష్ణ, టీవీఎస్ రాజు, సుధాకర్, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

సర్పంచ్ ఇంటి ముందు నిరసన

విశాలాంధ్ర చాట్రాయి: అత్యంత దుర్మార్గంగా తన తండ్రిని హింస పెట్టడం వల్ల చనిపోయాడనీ, తన తండ్రి కారణమైన వాళ్లను కఠినంగా శిక్షించాలని కలవల శ్రీను కూతురు మహేశ్వరి డిమాండ్ చేసింది. పంచాయతీ పేరుతో పిలిచి దాడి చేయడంతో అవమానభారంతో పురుగులు మందు తాగి చనిపోయిన కలవల శ్రీనివాస్ మృతదేహం ఆదివారం సాయంత్రం గ్రామానికి తీసుకువచ్చి సర్పంచి ఇంటి ముందు నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న నూజివీడు రూరల్ సిఐ అంకబాబు హుటా హుటిన అక్కడికి చేరుకున్నారు. ఈ సందర్భంలో మృతుడు కూతురు మహేశ్వరి, భార్య పుష్పావతి మాట్లాడుతూ ఏవిధమైన కారణం లేకుండా మానసికంగా హింస పెట్టి చంపేశారని వారందరినీ కఠినంగా శిక్షించాలని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచ్ అయ్యుండి పంచాయతీలో ఆటవికంగా ప్రవర్తించినందున సర్పంచ్ పదవి కూడా రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. వారు కోరిన ప్రతి డిమాండ్ సీఐ అంకం బాబు సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే 8 మంది వరకు అరెస్టు చేశామని మీరు చెప్పిన ప్రతి ఒక్కరి పేరు ఎఫ్ఐఆర్లో నమోదు చేశామని మీకు న్యాయం జరిగే విధంగా కచ్చితంగా చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈ నిరసన కారణంగా కొంత సమయం సోమవారం గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది .ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభించాయి. సీఐ నచ్చజెప్పడంతో పరిస్థితి మొత్తం శాంతించింది.

సీఎం పర్యటనకు పటిష్ఠ బందోబస్తు

విశాలాంధ్ర-పోలవరం: పోలవరంలో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ పర్యటనకు పటిష్టమైన బందోబస్త్ ఏర్పాటుచేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. లావణ్య వేణి పోలీసు అధికారులను ఆదేశించారు. ఈనెల 6వ తేదీన పోలవరం ప్రాజెక్ట్ పనుల పరిశీలనకు రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ విచ్చేస్తున్న దృష్ట్యా ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలలో ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆదివారం జేసీ పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్య వేణి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. 6వ తేదీ ఉదయం గం.10.20 ని.లకు ముఖ్యమంత్రి హెలికాప్టర్ లో పోలవరం ప్రాజెక్ట్ సైట్ కు చేరుకుంటారని, ప్రజాప్రతినిధులను కలుసుకున్న అనంతరం, ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్, డయాఫ్రమ్ వాల్, ఎర్త్ కం రాక్ ఫిల్ డ్యామ్ లో పనులను పరిశీలిస్తారన్నారు. అనంతరం ప్రాజెక్ట్ సైట్ లోని సమావేశపు హాలుకు చేరుకొని, అధికారులు, ఇంజనీర్లతో ముఖ్యమంత్రి సమీక్షిస్తారన్నారు. హెలిప్యాడ్ వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలనీ, ప్రముఖులు కూర్చునేందుకు వీలుగా టెంట్లు ఏర్పాటుచేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో విస్తృతమైన బందోబస్త్ ఏర్పాటు చేయాలనీ పోలీసు అధికారులను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్ పి మేరీ ప్రశాంతి, అసిస్టెంట్ కలెక్టర్ లు అపూర్వ భరత్ , శ్రీపూజ, ప్రాజెక్ట్ ప్రాజెక్ట్ చీఫ్ ఇంజనీర్ సుధాకరబాబు, ఆర్డీఓ లు కె. పెంచల్ కిశోర్, ఝాన్సీరాణి, ఉద్యానవనాలు శాఖ డిప్యూటీ డైరెక్టర్ రవికుమార్, తహసీల్దార్ సుమతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినూత్న ఆందోళన

విశాలాంధ్ర-ఆకివీడు: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు రెండు గంటల పైనే విద్యుత్ సబ్‌స్టేషన్ వద్దశనివారం రాత్రి ఆందోళనకు దిగారు. లోఓల్టేజి సమస్య పరిష్కరించాలంటూ గత కొంతకాలంగా అధికారులకు మొత్తుకుంటున్న స్పందన లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నగర పంచాయతీ పరిధిలోని ఆరో వార్డులో నెలకు పైనే ట్రాన్స్ఫార్మర్ బిగించినప్పటికీ నేటికి ప్రారంభించడం జరగలేదన్నారు. 6వ వార్డు కౌన్సిలర్ గుర్రాన్ని నాగలక్ష్మి ప్రజల సహకారంతో ఏర్పాటు చేసిన ట్రాన్స్ఫార్మర్ దిమ్మ ప్రారంభించారని నెపంతో అధికారులు ఆమెను దుర్భాషలాడారన్నారు. ఏ ఒక్క విద్యుత్ సిబ్బంది స్థానికంగా నివాసం ఉండడం లేదని దీనివల్ల ప్రజల సమస్యలు ఏమి తెలుస్తాయని ఆయన ప్రశ్నించారు. గంటన్నర పైనే ఆందోళన చేసిన తర్వాత విద్యుత్ శాఖ ఏఈ ప్రసాద్ రాజు ఆందోళన ప్రాంతానికి చేరుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. అయినప్పటికీ ఎమ్మెల్యే భీష్మించుకొని ట్రాన్స్ఫార్మర్ కు విద్యుత్తు సరఫరా ఇచ్చేదాకా ఆందోళన విరమించేది లేదనిస్పష్టం చేశారు. అనంతరం వంట వార్పు కార్యక్రమం కూడా నిర్వహించడం జరిగింది. విద్యుత్ అధికారులు సోమవారం లోపు సమస్య పరిష్కారం చేస్తామని హామీ మేరకు రామరాజు నిరసన విరామించారు..